క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి కారణమైన కారు

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై కోడేకండ్ల వద్ద బుధవారం త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామస్తులు తెలిపిన సమాచారం...కదిరి వైపు నుంచి బత్తలపల్లి వైపు ఐచర్ వాహనం వస్తోంది. ఇదే సమయంలో కోడేకండ్లకు చెందిన రైతు రాము కూలీలను పిలిచి పొలం వద్దకు బైక్‌పై బయలుదేరాడు. కదిరి వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఐచర్‌ను, బైక్‌ను వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న రైతు రాము మాత్రమే స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆయనను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ఐచర్ వాహనం అక్కడ నుంచి వెళ్లిపోగా, కారు, ద్విచక్రవాహనం అక్కడే ఉన్నాయి.

ఈ క్రాప్ బుకింగ్ వేగవంతం చేయండి

అమడగూరు: ఖరీఫ్ పంటలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని ఏఓ వెంకటరమణాచారి సిబ్బందికి సూచించారు. బుధవారం రైతుసేవా కేంద్రాల సిబ్బందితో అమడగూరు వ్యవసాయ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు ఈ క్రాప్ బుకింగ్‌ను పూర్తి చేయాలన్నారు. అలాగే వీఆర్‌ఓలు ఇందులో పాల్గొనాలన్నారు. రీ సర్వే జరిగిన పంచాయతీల్లో తప్పకుండా వీఆర్‌ఓ, సర్వేయర్ సహకారం ఉంటేనే క్రాప్ బుకింగ్ జరుగుతుందన్నారు.

రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు


నాట్యం చేస్తున్న చిన్నారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోనున్న మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆలయంలో బుధవారం రెండోరోజు 353వ ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావనాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం లలిత నాట్య కళానికేతన్ నాట్య గురువులు బాబు బాలాజీ, కమలా బాలాజీ, రామలాలిత్యఆధ్వర్యంలో 25 మంది శిష్య బృందం చేసిన నాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. గాంధీనగర్‌లోని రాఘవేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వినతి


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధర్మవరం: పట్టణంలోని జీవనజ్యోతి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ, ఏఐఎస్‌ఓ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు డీఈఓ మీనాక్షిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతలయ్య, ఏఐఎస్‌ఓ జిల్లా నాయకులు నిరంజన్ యాదవ్ మాట్లాడుతూ జీవనజ్యోతి పాఠశాలలో కనీస సదుపాయాలు లేవన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్స్, బాత్రూంలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా చర్యలు శూన్యమన్నారు. ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోకుండా ఉన్న ఎంఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌బీ నాయకులు నరేంద్ర, పురుషోత్తం, వెంకీ, విజయ్, అశోక్, ఆంజనేయులు, మురళి, గౌతమ్ పాల్గొన్నారు.

కాలువ తీయించారు


వర్షపు నీరు వెళ్లేందుకు కాలువ తీస్తున్న దృశ్యం

కనగానపల్లి: ముక్తాపురం గ్రామంలోని వీధుల్లో నిలిచిన వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు అధికారులు కాలువలు తీయించారు. గ్రామంలో భారీగా వర్షపు నీరు నిల్వ ఉండటంపై బుధవారం 'సాక్షి'లో చెరువును తలపిస్తున్న ముక్తాపురం శీర్షిక కథనం ప్రచురితమైంది. స్పందించిన స్థానిక పంచాయతీ అధికారులు వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు ప్రత్యేకంగా కాలువలు తీయించారు. గ్రామంలో చాలాచోట్ల డ్రైనేజీలు పూడిపోవటంతో వర్షపు నీరంతా వీధుల్లో నిలుస్తోందని, ఆ నీరు వెళ్లేందుకు తాత్కాలికంగా కాలువలు తీయించామని పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు తెలిపారు.

ఔషధంతో ఆటలు!

- రోగి అడిగేది ఒకటి.. అంటగట్టేది మరొకటి
- ఇష్టారాజ్యంగా మెడికల్ షాపుల నిర్వహణ
- ఆసుపత్రుల్లో బ్రాండ్ల పేరుతో నిలువుదోపిడీ
- నామమాత్రంగా డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు





కదిరి టౌన్: పట్టణంలో ఔషధాల విక్రయాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. రోగుల ప్రాణాలు నిలిపే ఔషధాలపై విక్రయాలపై పర్యవేక్షణ కొరవడడంతో దుకాణాల్లో అమ్ముతున్న మందులు అసలువో...నకిలీవో పట్టించుకునే దిక్కులేకుండా పోతోంది. మెడికల్ షాపుల నిర్వహణకు ఔషధ తనిఖీ అధికారి లేకపోవడంతో మరో అధికారి అక్రమాలకు తెరలేపాడు. పట్టణంలో దాదాపు మెడికల్ షాపులు 98, మెడికల్ ఏజెన్సీలు 25 ఉన్నాయి. ఈ దుకాణాల్లో నిబంధనల మేరకు మందులు భద్రపరుస్తున్నారా లేదా అనే విషయాన్ని కూడా పరిశీలించే పరిస్థితి లేకుండా పోయింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలను పరిశీలించే అధికారి, పట్టణంలో పరిశీలించే తనిఖీ అధికారి ఒక్కరే ఉన్నారు. మూడు నెలలకోసారి రూ.3 వేల చొప్పున అధికారులకు మామూళ్లు ఇచ్చుకోవాల్సిందేనని, లేకపోతే నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తారని షాపుల యజమానులు పేర్కొంటున్నారు.

పుట్టగొడుగుల్లా మెడికల్ షాపులు

పట్టణంలో ఏవీధిలో చూసినా చూసినా మెడికల్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.దీనికి తోడు ఆస్పత్రులకు అనుసంధానంగా ఆసుపత్రుల నిర్వాహకులే దుకాణాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో రెండేళ్లలో భారీగా మెడికల్ దుకాణాలు పెరిగినట్లు తెలుస్తోంది. అయితే దుకాణాదారులు నిబంధనలను పాటించడం లేదు. విచ్చలవిడిగా మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. డాక్టర్లు రాసిచ్చిన మందులను కాకుండా మెడికల్ షాపుల నిర్వాహకులు తమ వద్ద ఉన్న మందులను అంటగడుతున్నట్లు రోగులు వాపోతున్నారు.

నిబంధనలకు నీళ్లు..

షాపుల్లో తప్పనిసరిగా ఫార్మసిస్టు ఉండాలన్న నిబంధన ఉంది. కానీ చాలా మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టు లేరు. అయినా ఈ విషయంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మత్తు ఔషధాల విక్రయం, రికార్డుల నిర్వహణ పక్కగా ఉండాలి. ఈ విషయాన్ని మెడికల్ షాపుల నిర్వాహకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇక ఎవరికి తోచినట్లు వారు యాంటి బయాటిక్స్, మత్తు మాత్రలు విక్రయిస్తున్నరన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని షాపుల్లో గడువు తీరిన మందులు, అనుమతి లేనివి కూడా విక్రయిస్తున్నట్లు సమాచారం. కొన్ని షాపుల్లో కంపెనీలు ఇచ్చే శ్యాంపిల్స్‌ను కూడా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. బ్రాండెడ్ మందుల పేర్లతో రోగులను దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మెడికల్ షాపుల ఆగడాలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మందులు అధిక ధరలకు విక్రయించడంపై చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ ఏడీ రమేష్‌రెడ్డి తెలిపారు. ఏ షాపు నుంచి కూడా మామూళ్లు వసూలు చేయడం లేదని చెప్పుకొచ్చారు.

అధిక ధరలకు విక్రయిస్తున్నారు



కదిరిలోని మెడికల్ షాపుల్లో మందులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మెడికల్ షాపులను ప్రతి మూడు నెలలకొసారి తప్పనిసరిగా తనిఖీ చేయాలి. కానీ ఇక్కడ తనిఖీలు చేసే దాఖలు లేవు. అధికారులు మామూళ్ల మత్తులో పడి షాపుల నిర్వహణపై దృష్టి సారించడం లేదు. దీంతో మెడికల్ షాపుల నిర్వాహకులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది.
–జగన్మోహన్ కదిరి

నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



మందులు షాపుల్లో మందులు కొనాలంటేనే భయం వేస్తోంది. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే మెడికల్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి. మనిషి ప్రాణానికి సంబంధించిన మందుల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలి.
–శ్రీనివాసులు, కదిరి

దోషులను కఠినంగా శిక్షించాలి


కదిరిలో అభయకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్మికులు

అమడగూరు: కోల్‌కతాలో మెడికల్ విద్యార్థిని అభయపై ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆర్డీటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బుధవారం శీతిరెడ్డిపల్లి నుంచి అమడగూరు బస్టాండు వరకూ ప్లకార్డులు చేతపట్టుకుని గట్టిగా న్యాయం జరగాలంటూ నినాదాలు పలుకుతూ ర్యాలీ చేపట్టారు. బస్టాండులో మానవహారంగా ఏర్పడ్డారు. అత్యాచారం, హత్యకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్డీటీ సిబ్బంది నరసింగరాజు, ఏటీఎల్ మధుసూదన్, కళాశాల సిబ్బంది షానవాజ్, రఘునాథరెడ్డి, ఇందాదుల్లా, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం సీపీఎం, సీఐటీయు నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమన్నారు. సీపీఎం నాయకులు ఆటో పెద్దన్న, బాబు, బండల వెంకటేష్, పోతులయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు తదతరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: కోల్‌కతాలో డాక్టర్ అభయకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేత మాబున్నీషా మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.యూనియన్ నేతలు శారద,లక్ష్మి, సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తనకల్లు: కోల్‌కతాలో వైద్యురాలిని అత్యాచారం చేసి దారుణంగా హతమార్చిన దోషులకు ఉరిశిక్ష విధించాలని ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జాతీయ రహదారిపై బుధవారం ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ చెన్నకేశవ ప్రసాద్, ఆర్డీటీ సిబ్బంది మూర్తి, రాంప్రసాద్‌రెడ్డి, నారాయణస్వామి, కృషిత, జయరామప్ప పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో కళాజ్యోతి సర్కిల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ కో కన్వీనర్ ఎల్ ఆదినారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ నేతలు చంద్రకళ, సరస్వతి, నూర్జహాన్, నాగేశ్వరి, ఫాతిమా, పోతక్క, లలిత తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన హంతకుడిని కఠినంగా శిక్షించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. వైద్యురాలిపై జరిగిన అమానవీయ ఘటనను నిరసిస్తూ సీఐటీయూ నేత లింగన్న ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌సీ డాక్టర్ కార్తీక్ ,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, పాఠశాల సిబ్బంది రెహానాబేగం, అరుణ, లక్ష్మి, వీరా, ప్రతాప్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు గుర్తించండి


ఉపాధి హామీ సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీఓ చంద్రశేఖర్

ఎన్పీకుంట: మండలంలోని 14 పంచాయతీల్లో ఈ నెల 23న గ్రామసభలు ఏర్పాటు చేసి, ఉపాధి హామీ పనులను గుర్తించాలని ఏపీఓ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీఓ సమావేశం నిర్వహించి చేపట్టబోయే పనుల వివరాలను వెల్లడించారు. ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద జరగాల్సిన పనులపై ప్రజల తీర్మానం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ జేఈ రమేష్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అమడగూరు: మండల వ్యాప్తంగా 2024–25 ఏడాదికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పనుల ఎంపికపై శుక్రవారం గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మునెప్ప పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో జరిగే గ్రామసభలకు కూలీలు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా ఉన్న 14 పంచాయతీల్లో 2024–2025 సంవత్సరానికి ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ బుధవారం తెలిపారు. గ్రామసభల్లో ఉపాధి హామీ పనులను ఎంపిక చేస్తారన్నారు.

నల్లమాడ: ఉపాధి హామీ పనులపై ఎంపికపై శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండన్న తెలిపారు. బుధవారం తమ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల స్థాయి అధికారులు విధిగా హాజరై ఉపాధి హామీ పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏపీఓ సూర్యనారాయణ, ఈఓఆర్డీ అమర్నాథరెడ్డి, ఈసీ షేక్షావలీ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్ నబీ తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కూలీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

కనగానపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. ఈ సభల ద్వారా 2025 సంవత్సరంలో చేపట్టనున్న జాతీయ ఉపాధి హామీ పనులు, అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి చర్చిస్తామన్నారు. అందువల్ల గ్రామ సభలకు ఉపాధిహామీ సిబ్బందితో పాటు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

చెన్నేకొత్తపల్లి: కనుముక్కలలో బుధవారం ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అలాగే గర్భిణులకు రక్త పరీక్షలు చేసి తగు సూచనలు చేశారు. గ్రామంలో బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారికీ వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్య గ్రామంలో పర్యటించిన వైద్య సిబ్బంది... వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సౌందర్య, ఏఎన్ఎం సునీత, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, సరస్వతి, రాధిక, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తాడిమర్రి: తాడిమర్రి, పిన్నదరి, దాడితోట, కునుకుంట్ల, చిల్లవారిపల్లి, ఎం.అగ్రహారం విలేజ్ క్లీనిక్‌లలో బుధవారం ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు చిన్నారులకు బీసీజీ, పెంటా, రోటా, తదితర టీకాలను వేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు కోమలి, క్రిష్ణమ్మ, సుగుణ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుతో అధిక లాభాలు

అమడగూరు: రైతులు మల్బరీ పంట సాగుతో అధిక లాభాలను గడించవచ్చని పట్టు పరిశ్రమ అధికారులు పేర్కొన్నారు. బుధవారం మహమ్మదాబాద్‌లో గ్రామ సచివాలయంలో రైతులకు పట్టుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అధికారులు మాట్లాడుతూ పట్టు పెంపకంపై ప్రభుత్వం రైతులకు అధిక సబ్సిడీలను ఇస్తోందన్నారు. నాటే మొక్కల నుంచి కొత్తగా నిర్మించుకునే షెడ్లకు, పండించిన పట్టుగూళ్లకు కూడా సబ్సిడీ ధరను ఇస్తుందన్నారు. మల్బరీని సాగు చేస్తే రైతులు నష్టపోయే పరిస్థితి ఉండదన్నారు. కావున రైతులు పట్టు పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయాధికారి వెంకటరమణాచారి, సెరికల్చర్ సిబ్బంది నాగేశ్వర్ రావు, రైతులు పాల్గొన్నారు.

అలరించిన హృదయ వీణ

ప్రశాంతి నిలయం: ఒడిశా సత్యసాయి భక్తులు సత్యసాయిని కీర్తిస్తూ ఆలపించిన గీతాలు భక్తులను అలరించాయి. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఒడిశా సత్యసాయి భక్తులు బుధవారం సత్యసాయి సన్నిధిలో సుమారు గంట పాటు సంగీత కచేరీ నిర్వహించి భక్తులను మైమరపించారు. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ముదిగుబ్బ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామరాజు బుధవారం తెలిపారు. జువాలజీ, కామర్స్ అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించి పీజీలో కనీసం 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 27లోపు దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని, ఈనెల 29న ఎంపిక ఉంటుందని వివరించారు.

వర్షానికి దెబ్బతిన్న వేరుశనగ

కనగానపల్లి: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికి వచ్చిన పంటలు దెబ్బతింటున్నాయి. మండలంలోని సీఎస్ కోట గ్రామంలో రైతు అంథోనిస్వామి ఖరీఫ్‌లో ముందస్తుగా వేసిన వేరుశనగ మరికొద్ది రోజుల్లో తొలగించాల్సిన ఉండగా... వర్షాలకు భూమిలోనే కాయలన్నీ మొలకలు వచ్చాయి. దీంతో పంటను ముందుగానే తొలగించాల్సి వచ్చిందని, కానీ ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో తొలగించిన పంట కూడా తడిసిపోతోందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా బుధవారం దెబ్బతిన్న వేరుశనగ పంటను సీపీఐ మండల నాయకులు బాలరాజు, మల్లికార్జున పరిశీలించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ధర్మవరం: సీజనల్ వ్యాధులు, అతిసారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారి కేసీకే నాయక్, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్యసేవలను అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. డీపీఎంఓ చిన్న కుళ్లాయప్ప నాయక్, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరాంనాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానించాలి


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రైతు సంఘం, సీఐటీయూ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామి కింద కూలీలకు ఏడాదికి 200 రోజులు పనిదినాలను కల్పించాలన్నారు. కూలీలకు రోజుకు రూ.600 వేతనం అందేలా చూడాలన్నారు. పనులు చేసేందుకు కూలీలకు పనిముట్లను ప్రభుత్వమే అందించాలన్నారు. ఉపాధి పనులను కేవలం కూలీలతో మాత్రమే చేయించాలన్నారు. పనికి వెళ్లే ప్రతి కూలీకి జాబ్ కార్డును మంజూరు చేసి పనులు కల్పించాలన్నారు. రైతులకు ఉపయోగపడేలా పనులు చేయించాలన్నారు. సీఐటీయూ సీనియర్ నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయు కన్వీనర్ జేవి రమణ, సీపీఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, చేనేత నాయకులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి హామీ పనుల ఎంపికపై గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. ఉపాధి కూలీలు, ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది హాజరుకావాలని కోరారు.

ఈ-క్రాప్ పారదర్శకంగా చేపట్టండి

తాడిమర్రి: మండలంలో ఖరీఫ్ కింద సాగైన పంటలకు ఈ-క్రాప్ నమోదు పారదర్శకంగా చేపట్టాలని ఏఓ రమాదేవి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఆమె సిబ్బందికి సమావేశమయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ, కంది, పెసర, వరి తదితర పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఏఈఓలు విజయకుమార్, ఓబుళమ్మ, వీహెచ్ఏలు గౌతమి, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'భారత్ బంద్'



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నేతలు

కదిరి అర్బన్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం పట్టణంలో మాలమహానాడు ఆధ్వర్యంలో తలపెట్టిన భారత్‌బంద్ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. నాయకులు అంబేడ్కర్ విగ్రహం నుంచి చౌక్‌బజార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. భవిష్యత్తులో తమ ఆందోళనలు ఉధృతం చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణపై ముందుకు వెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పిచ్చల రామచంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యుడు రామచంద్ర, గోపాల్, కదిరప్ప, బాలముని,నరేష్, రామచంద్ర, శివన్న, సూరి, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండె వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తనకల్లు: మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వ వైద్యురాలు సాదియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అనంతపురంలోని మార్క్ ఆస్పత్రి వైద్యులు గుండె జబ్బులతో బాధపడుతున్న రోగులను పరీక్షించారు. మందులను అందజేశారు. మొత్తం 136 మంది రోగులకు వైద్య సేవలను అందజేసినట్లు వైద్యులు తెలిపారు.

కేసు నమోదు

కదిరి అర్బన్: పొలం తగాదా విషయమై యాకాలచెర్వుకొత్తపల్లికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు బుధవారం రూరల్ అప్‌గ్రేడ్ సీఐ మోహన్ తెలిపారు. యాకాలచెర్వు కొత్తపల్లికి చెందిన మీసాల రెడ్డెప్ప, అదే గ్రామానికి చెందిన ఈశ్వరయ్యకు పొలం విషయంలో నాలుగేళ్లుగా వివాదం ఉందని, ఈవిషయంలో మీసాల రెడ్డెప్పపై ఈశ్వరయ్య, అతని కుమారుడు నాగార్జున, కోడలు జయలక్ష్మీ దాడి చేసి గాయపరిచారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

విలేకరిపై కేసు నమోదు

కదిరి టౌన్: పట్టణంలో అధిక వడ్డీ వసూలు చేస్తున్న ఓ టీవీ చానల్ విలేకరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ డి.వి.నారాయణరెడ్డి తెలిపారు. టీవీ చానల్ విలేకరిగా పని చేస్తున్న సుల్తాన్ చిరు వ్యాపారులకు వడ్డీకి డబ్బు ఇచ్చేవాడు. కమిషన్‌తో పాటు అధిక వడ్డీ వసూలు చేయడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సుల్తాన్‌పై కేసు నమోదు చేశామని, పట్టణంలో ఎవరైనా అధిక వడ్డీ వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.